## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ క్లస్టర్ అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. క్లస్టర్–1(1, 23, 24, 25, 26, 27, 36 డివిజన్లు) అధ్యక్షుడిగా పిల్లుట్ల వంశీ, క్లస్టర్–2 (28, 29, 30, 31, 32, 33, 57) అధ్యక్షుడిగా భోగాది మురళీ, క్లస్టర్–3 (58, 59, 60, 61, 62, 63, 64) అధ్యక్షుడిగా పసుపులేటి ఏసు నియమితులయ్యారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం సబ్‌స్టేషన్ 11కేవీ మ్యూజిక్ కాలేజీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాపురం, బావాజీపేట, రాఘకోటి మైదానం ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### నిత్యావసరాల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో 150 మంది ముస్లిం నిరుపేదలకు నిత్యావసర వస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. రంజాన్ తోఫాతో పాటు ముస్లిం మహిళలకు చీరలు, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం ఇచ్చే గొప్ప సందేశమని పేర్కొన్నారు. అలాగే ఉగాది పండుగను పురస్కరించుకుని భక్తులకు నాగమానసాదేవి అమ్మవారి చీర, పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

### దివ్యాంగునికి వీల్ చైర్ అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం దివ్యాంగుడు వెంకటేశ్వరరావుకు వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోరంగ నాగమల్లీశ్వరి మాట్లాడుతూ ఒక కాలు లేని వెంకటేశ్వరరావు వీల్‌చైర్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో ట్రస్ట్ సభ్యుల సహకారంతో వీల్ చైర్ అందజేస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ సభ్యులకు వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్‌కే షఫీవుల్లా, ఫణి తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సహజీవనం చేస్తున్న వ్యక్తి అనుమానంతో పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన ఘటనలో మహిళ గురువారం మృతి చెందింది. కేఎల్‌రావు నగర్ కుండల మార్కెట్ ప్రాంతానికి చెందిన వీర్ల చంద్రకళ కొంత కాలంగా తుమ్మెపల్లి పుల్లారావుతో సహజీవనం చేస్తోంది. కొంత కాలంగా పుల్లారావు, చంద్రకళపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22న ఇంట్లో నిద్రపోతున్న ఆమెపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఘటనలో తీవ్రగాయాల పాలైన చంద్రకళ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. ఘటనపై కొత్తపేట పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు.

### వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాత బస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని గురువారం నిర్వహించారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం)లో త్రయోదశిని పురస్కరించుకొని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మాసంలోనూ త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా గురువారం సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారికి విశేష పుష్పాలంకరణ, పంచహారతులు, ప్రత్యేక అభిషేకాలను ఆలయ అర్చకులు చేపట్టారు.

# మురుగునీరు ముందుకు సాగేదెలా..?

- శాపంగా మారిన అధికారుల సమన్వయ లోపం
- నిలిచిన కల్వర్ట్ పనులు



మురుగు నిలిచిపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అధికారుల సమన్వయలోపం అయోధ్యనగర్, సూరిబాబు కాలనీ వాసులకు శాపంగా మారింది. అయోధ్యనగర్ తదితర ప్రాంత వాసులు వాడిన మురుగు నీరు బుడమేరులోకి వెళుతుండేది. పాతకాలం నాటి మురుగుకాలువ, కల్వర్ట్ కావడంతో శిథిలమయ్యాయి. దీంతో అయోధ్యనగర్ వాసులు వాడిన మురుగు సక్రమంగా బుడమేరులోకి వెళ్లడం లేదు. బుడమేరు వరదల సమయంలో సైతం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు నూతనంగా కల్వర్ట్ నిర్మించేందుకుగానూ అవసరమైన నిధులను అధికారులు మంజూరు చేశారు. పాత మురుగుకాలువ పక్కనే కొత్త కల్వర్టరు నిర్మించేందుకు పనులు సైతం ప్రారంభించారు. అయితే ఇంతలో రైల్వే అధికారులు ఇది తమ స్థలమని ఇక్కడ కల్వర్ట్ కట్టడానికి వీల్లేదంటూ అడ్డుకున్నారు. దీంతో కల్వర్ట్ పనులు నిలిచిపోయాయి. మురుగుకాలువ తవ్వి కల్వర్ట్ నిర్మించి కనెక్షన్ ఇవ్వకపోవడంతో అయోధ్యనగర్ వాసులు వాడిన మురుగునీరు సూరిబాబు కాలనీలోని పల్లపు ప్రాంత వాసుల ఇళ్లలోకి చేరుతోంది. దీంతో సూరిబాబు కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇళ్లలోకి చేరిన నీటిని మోటారు సాయంతో తోడించారు. తాత్కాలికంగా మురుగు నుంచి బయటపడినప్పటికీ శాశ్వత పరిష్కారం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**రైల్వే, వీఎంసీ అధికారుల సర్వే**

ఇక్కడ మురుగుకాలువ, కల్వర్ట్ నిర్మించే ప్రాంతం ఎవరిదనే విషయమై ఇప్పటికే పలుమార్లు రైల్వే, నగరపాలకసంస్థ అధికారులు సర్వే చేశారు. అయితే ఈ స్థలం రైల్వేలోకి రాదని డీఆర్‌ఎం సమక్షంలో స్పష్టత వస్తేనే పనులకు అనుమతి ఇస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు పనులకు అంగీకరించకపోవడంతో మురుగుకాలువ కోసం తవ్విన ప్రాంతాన్ని సైతం పూడ్చివేశారు.



కల్వర్ట్ వద్ద పనులు చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

**రాకపోకలకు ఇబ్బందులు**

రైల్వే అధికారుల తీరు వల్ల ఇక్కడ రాకపోకలకు సైతం తిప్పలు తప్పడం లేదు. సుబ్బరాజునగర్, న్యూఆర్‌ఆర్‌పేట తదితర ప్రాంత వాసులు రైల్వే ట్రాక్ కింద అండర్‌పాస్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ రోడ్డు వేసేందుకు సైతం రైల్వే అధికారులు అంగీకరించడం లేదు. దీంతో గోతులమయంగా ప్రమాదకరంగా ఉన్నప్పటికీ దగ్గరి దారి కావడంతో ఈ రోడ్డుమీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే ఇక్కడ తరచూ మరమ్మతుల పేరిట రోడ్డును సైతం మూసివేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**త్వరగా పనులు పూర్తిచేయాలి**



ఇక్కడ పాతకాలం నాటి మురుగుకాలువ కావడంతో మురుగు ప్రవాహం సక్రమంగా జరగడం లేదు. తరచూ మురుగు నిలిచిపోయి దోమలు పెరిగిపోతున్నాయి. అలాగే సూరిబాబుకాలనీలోకి సైతం వెళుతున్నాయి. రైల్వే, నగరపాలకసంస్థ అధికారులు కలిసి మాట్లాడుకుని సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలి.

– సీహెచ్ ఆదామ్‌కుమార్, స్థానికుడు

## నేటి బీబీఏ ఎన్నికలకు సర్వం సిద్ధం

విజయవాడలీగల్: 2025–26 సంవత్సరానికిగానూ బెజవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం జరిగే ఎన్నికల్లో 1998 మంది పురుష ఓటర్లు, 721 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సివిల్‌కోర్టు ప్రాంగణం పక్కనే ఉన్న కె.ఎల్.రావుభవన్‌లో పురుషులు, లైబ్రరీ హాలులో మహిళలు ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రధాన ఎన్నికల అధికారి డి.పి.రామకృష్ణ కోరారు. ఓటు హక్కును వినియోగించుకునే న్యాయవాదులు తప్పనిసరిగా బార్ అసోసియేషన్ గుర్తింపు కార్డు లేదా హైకోర్టు గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యక్ష పదవికి పిళ్లా శ్రీనివాసరావు, 30 ఏళ్ల పైబడిన విభాగంలో పి.వి.ఏడుకొండలు మాత్రమే మాత్రమే నామినేషన్ వేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్ల పైబడిన విభాగంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా 14 మందికి అవకాశం ఉండగా, 14 మంది మాత్రమే నామినేషన్ వేయడంతో వారు కూడా ఏకగ్రీవమయ్యారని ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు. పోటీలో అధ్యక్ష పదవికి ఎ.కె.బాషా, బి.డేవిడ్‌రత్నకుమార్, వి.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పదవికి బి.నాగేశ్వరరావు, ఆర్.చునావ్, కె.వి.రంగారావు, ఎస్.వి.వి.సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ పదవికి జి.వి.లక్ష్మి, కె.సుబ్బారావు, ట్రెజరర్ పదవికి ఐ.రవీంద్రనాథ్, ఎం. సత్యనారాయణ, లైబ్రరీ సెక్రటరీగా కె.త్రినాథ్ కుమార్, పి.సత్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కె.నవీన్‌కుమార్, పి.రవిబాబు, లేడీ సెక్రటరీగా జి.మాలతి, కె.అనురాధ పోటీ చేస్తుండగా, 20 ఏళ్ల పైబడి ఇద్దరు, 10 ఏళ్ల పైబడి 9 మంది పురుష, ఇద్దరు మహిళా న్యాయవాదులు పోటీ చేస్తున్నారు.

## సిద్ధార్థలో నేడు కురుక్షేత్ర - 2కే25



పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు శుక్రవారం సిద్ధార్థ ఆడిటోరియంలో కురుక్షేత్ర–2కే25 పేరుతో వివిధ అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. కళాశాలలోని సెమినార్ హాల్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక పోటీతత్వం రూపొందించేందుకు గత 28 సంవత్సరాలుగా కురుక్షేత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి జంపాల మాట్లాడుతూ.. బిజినెస్ క్విజ్, స్టాక్ మార్కెట్ గేమ్, యంగ్ మేనేజర్, మార్కెట్ మేకర్స్, హెచ్‌ఆర్ ఈవెంట్, న్యూ ఐడియా కాంటెస్ట్, డ్యాన్స్, ట్రెజర్ హంట్, మిస్టర్ అండ్ మిసెస్ కురుక్షేత్ర–2కే25 పేరుతో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు గుంటూరు, తెనాలి, ఏలూరు ప్రాంతాల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈవెంట్ సమన్వయకర్త డాక్టర్ ఎండీఎస్.రహమాన్, అధ్యాపకులు డాక్టర్ ఎస్‌బీ.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, ఏఎస్‌ఎన్.లక్ష్మి, డాక్టర్ కె.అరుణ్‌కుమార్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు తేజేశ్వరరావు, కల్యాణ్, భాను, పూజిత, లిఖిత, భాగ్య, తేజశ్విని, భువనచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మురుగుకాలువల్లో సిల్ట్ తొలగింపు



సిల్ట్ తొలగింపు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

మధురానగర్(విజయవాడసెంట్రల్)/పాయకాపురం(విజయవాడరూరల్): బుడమేరు వరదల సమయంలో పూడుకుపోయిన మురుగు కాలువల్లో సిల్ట్‌ను రూ. 16లక్షలతో తొలగిస్తున్నట్లు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డు సెంటర్‌లో గురువారం సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పైపులరోడ్డు నుంచి కండ్రిక, ఏపీఎస్‌రెడ్డి రోడ్డు, ఉడాకాలనీ రోడ్డు, ఎల్‌బీఎస్ నగర్ వరకు మొత్తం 4.1 కిలోమీటర్ల పరిధిలో సిల్ట్‌ను తొలగించనున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్‌లోను పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దాసరి కనకరావు, పైడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులపై కక్ష సాధింపు సరికాదు



ప్రచార కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు

పాయకాపురం(విజయవాడరూరల్): చిరు వ్యాపారులపై అధికార పార్టీ నేతలు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ప్రకాష్‌నగర్ సెంటర్‌లో హాకర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ గురువారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సిటీ సెంట్రల్ అధ్యక్షుడు కే దుర్గారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు చిరు వ్యాపారులకు అండగా ఉంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల నుంచే వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతూ కండ్రిక, రాజీవ్‌నగర్‌లతో పాటు అనేక ప్రాంతాల్లో వ్యాపారాలను తొలగించారని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు దిగుతున్నారని అన్నారు. హాకర్లపై కక్ష సాధింపు చర్యలు మానుకొని అందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29వ తేదీన అలంకార్ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాలో చిరు వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయవాడ హాకర్స్, తోపుడు బండ్ల యూనియన్ సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు బెవర వెంకటేశ్వరరావు, సీహెచ్ మురళి, నగర నాయకులు బాలబొమ్మ లక్ష్మణ, పీ సాంబిరెడ్డి, ఎస్ అప్పన్న, ఎస్‌కే మస్తాన్, కుమార్, పలువురు చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తేలికపాటి ఆహారం తీసుకోవడం, నీరు ఎక్కువగా తాగడం వంటి చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ బారిన పడకుండా ఉండవచ్చని హోమియో వైద్యుడు సీహెచ్ కిశోర్ కుమార్ అన్నారు. కేబీఎన్ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యాన గురువారం విజయవాడ నగర పరిధిలోని వివిధ పాఠశాల్లో వడదెబ్బ నివారణ పట్ల అవగాహన, ఉచిత హోమియో మందు పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. వదులుగా ఉండే దుస్తులు వేసుకోవాలని, కొబ్బరినీరు, బార్లీ, మజ్జిగ వంటి చలవ చేసే ద్రవాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు హోమియో మందు పంపిణీ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ ఎం.శాంతిబాబు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డి.పవన్ కుమార్, జి.సీతారత్నం, పి.గౌతమి, ఎన్.సాంబశివరావు, స్టూడెంట్ వలంటీర్లు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకు కొరియర్ ద్వారా ఉగాది పచ్చడి

**ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల సంక్షేమ సంఘం**



కొరియర్ ద్వారా చంద్రబాబుకు ఉగాది పచ్చడి పంపుతున్న వలంటీర్ల సంఘం నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు కొరియర్ ద్వారా ఉగాది పచ్చడి పంపారు. తాము పంపిన ఉగాది పచ్చడి తిని అయినా తమకు ఇచ్చిన హామీ గుర్తు తెచ్చుకోవాలని వలంటీర్లు వేడుకున్నారు. గురువారం ఏలూరు రోడ్డులోని డీటీడీసీ కొరియర్ ద్వారా ఉగాది పచ్చడిని చంద్రబాబుకు పంపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వలంటీర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు మాట్లాడుతూ 2024 సంవత్సరం ఉగాది రోజున చంద్రబాబు వలంటీర్లకు ఇచ్చిన హామీని గుర్తుచేశారు. ఉగాది పండుగ రోజు వలంటీర్లకు తీపి కబురు అంటూ రూ. 5వేల గౌరవ వేతనం ఏం సరిపోతుందని కూటమి అధికారంలోకి వస్తే నెలకు రూ. 10వేలు ఇస్తానని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.60లక్షల మంది వలంటీర్లను చంద్రబాబు నమ్మబలికాడన్నారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క రూపాయి వేతనం ఇవ్వలేదని అన్నారు. కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా వలంటీర్లను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవోల పేరుతో 2.60లక్షల మంది వలంటీర్ల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. ఇప్పటికైన రాష్ట్రంలో వలంటీర్లను కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వలంటీర్ల సంఘం నాయకులు సరోజిని, నరేష్, కళ్యాణ్, షైనీ, శివ పార్వతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## 2న బహిరంగ వేలం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ శ్రీ విజయేశ్వరస్వామి వారి దేవస్థానానికి చెందిన దుకాణాలను అద్దెకిచ్చేందుకు ఏప్రిల్ రెండో తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే వెంకట్‌రెడ్డి తెలిపారు. రెండో తేదీ ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలం జరుగుతుందన్నారు. తనిఖీ అధికారి సృజన్ పర్యవేక్షణలో వేలం నిర్వహిస్తామని చెప్పారు. షాపులు అద్దెకు కావలసినవారు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి, డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఈఓ తెలిపారు.

## 30న త్రిశక్తి పీఠంలో పంచాంగ శ్రవణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఈ నెల 30వ తేదీ సాయంత్రం 6.15 గంటల నుంచి పంచాంగ శ్రవణం జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు వసంత రాత్రులు సందర్భంగా మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు నిత్య అభిషేకం, పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. అభిషేకం, పుష్పార్చనలో పాల్గొనాలనుకునే భక్తులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## కళాకారులు సాంస్కృతిక వారధులు



కళారంగానికి చెందిన వారిని సత్కరించిన నిర్వాహకులు



హనుమంతరాయ గ్రంథాలయంలో హాస్య ప్రహసనాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని కామ్రేడ్ జీఆర్కే, పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి, తెలుగు కళావాహిని ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని ప్రిన్స్ డిజిటల్ మీడియా కార్యాలయంలో గురువారం ప్రపంచ రంగస్థల దినోత్సవం, కళారంగానికి చెందిన పలువురికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా రంగస్థల దినోత్సవం జరుపుకొంటున్నట్లు తెలిపారు. కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని సూచించారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని యువతను నాటకం రంగం వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్ట్ రంగస్థల దినోత్సవం అంశంగా మాట్లాడారు. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షణలో కళారంగానికి చెందిన మండ లక్ష్మి, ఎస్ అనిత, పేరం వెంకటేశ్వర రెడ్డి, బీ మల్లేశ్వర పట్నాయక్, శ్యాంప్రసాద్, అమ్ముల ప్రసాద్, డేవిడ్‌రాజులను ఆత్మీయంగా సత్కరించారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం సందర్భంగా దృశ్యవేదిక, సుమధుర కళానికేతన్, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హర్ష క్రియేషన్స్, ఈవీఎస్ కళాసమితి, సాగర్ ఆర్ట్స్ థియేటర్స్, ఏపీ సెక్రటేరియట్ మహిళా విభాగం ఆధ్వర్యంలో రంగస్థల నటీనటులు ప్రదర్శించిన హాస్య ప్రహసనాలు అలరించాయి. బొర్రా నరేస్ కర్ణుడిగా, బీకేఎస్‌ఎస్ ప్రసాద్ బాలచంద్రుడిగా, ఎల్‌ఎస్‌ఆర్‌కే ప్రసాద్ దుర్యోధనుడుగా, పీ సాయి శంకర్ భారతీయుడిగా ప్రదర్శించిన ఏక పాత్రాభినయం అలరించింది. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ నాటక రంగ అభివృద్ధికి సంస్థలు చేయవలసిన కృషి అంశంగా ప్రసంగించారు. రంగస్థల ప్రముఖులు హెచ్‌వీఆర్‌ఎస్ ప్రసాద్, పసుమర్తి భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

## పన్నుపై వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి



నోటీసులు జారీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపులపై 50 శాతం వడ్డీ మాఫీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ సిబ్బంది సూచించారు. 48వ డివిజన్ పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థలాలు, నీటి పన్నులు బకాయిలు ఉన్న నివాసితులకు కార్పొరేషన్ సిబ్బంది గురువారం నోటీసులు జారీ చేశారు. మార్చి 30 నాటికి బకాయిలు ఉన్న ప్రతి ఒక్కరూ పన్నులను చెల్లించాలని సూచించారు. డివిజన్ పరిధిలోని సాధుజాన్ వీధి, రాయప్ప రాజు వీధి, టేనర్‌పేట అడ్డరోడ్డు పరిధిలో నోటీసులు జారీ చేశారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన పన్నులను సకాలంలో చెల్లించాలని, ఏప్రిల్ ఒకటి తర్వాత బకాయిదారుల నివాసితుల ఇంటి కుళాయి కలెక్షన్లు తొలగిస్తామన్నారు. నెలాఖరులోగా బకాయిల మొత్తాన్ని చెల్లించాలని సూచించారు.

**వార్డు సచివాలయాల్లోనూ పన్నుల చెల్లింపు**

పటమట(విజయవాడతూర్పు): ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపులపై 50 శాతం వడ్డీ మాఫీకి నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందన్నారు. పన్నుల చెల్లింపుదారుల కోసం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 13 క్యాష్ కౌంటర్లు అన్ని ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. విజయవాడ నగర పరిధిలోని 286 సచివాలయాల్లోనూ పన్ను చెల్లింపులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

## వక్ఫ్ సవరణ చట్టాలకు వ్యతిరేకం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్ సవరణల చట్టానికి తాము కూడా వ్యతిరేకమేనని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ చెప్పారు. మొగల్రాజపురంలోని సమితి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం జరిగింది. షిబ్లీ మాట్లాడుతూ మాతో పాటు అన్ని ముస్లిం మైనారిటీ ప్రజా సంఘాలు వక్ఫ్ సవరణ చట్టాలకు వ్యతిరేకమేనన్నారు. వక్ఫ్ సవరణ చట్టంలోని అభ్యంతరాలను ఇప్పటికే ప్రభుత్వానికి, కమిటీని కలిసి విన్నవించామని ఆయన చెప్పారు. వివిధ మతాలు ప్రజల మధ్య సోదరభావం పెంచే పవిత్ర ఇఫ్తార్ విందుకు వక్ఫ్ బిల్లు అంశానికి జోడించటం సమంజసం కాదని షిబ్లీ అన్నారు.

## చేతి వృత్తులపై అవగాహన అవసరం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగ విద్యార్థులు ఆయా స్థానిక చేతి వృత్తులపై అవగాహన పెంచుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ అన్నారు. ఆ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలోని 'సంస్కృతి పునరుద్ధరణ' పేరుతో కళంకారి కళపై ఫీల్డ్ స్టడీ కార్యక్రమాన్ని పెడనలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తమ స్థానిక ప్రాంతాల్లో ఉన్న వృత్తులు, సంస్కృతులను అర్థం చేసుకొని నూతన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు కృషి చేయాలన్నారు. అలాగే మారుతున్న కాలానుగుణంగా సృజనాత్మకతను పెంపొందించుకొని ఆయా రంగాల్లో ముందుకు సాగితే మంచి విజయాలను సాధించవచ్చని చెప్పారు. అనంతరం కళాంకారి కళలో పలువురు ప్రముఖుల అనుభవాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంఠ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాసవీ అమ్మవారి మందిరంలో ఉగాది వేడుకలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సౌమ్య థియేటర్ సమీపంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో విశ్వావసు నామ సంవత్సరాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 30వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 5.31 గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం గణపతి పూజ, అభిషేకం జరుగుతుందన్నారు. వాసవీ అమ్మవారికి రజతకవచం, సువర్ణ ఆభరణాలతో విశేషంగా అలంకరిస్తామని చెప్పారు. ఉదయం 9.30 గంటలకు లలితా సహస్ర నామ పారాయణం, దక్షిణావృత శంఖంచే తీర్థం ఇస్తామన్నారు. సాయంత్రం పంచాంగ శ్రవణం, సామూహిక మహాలక్ష్మీ దేవి పూజ, సౌందర్యలహరి, మణిద్వీప వర్ణన జరుగుతుందని తెలిపారు.